మంగళవారం
06-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 76
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

బ్రిటన్ నూతన ప్రధాని లిజ్ ట్రస్

బ్రిటన్ కొత్త ప్రధానమంత్రిగా రిషి సునక్‌పై లిజ్ ట్రస్ (47) విజయం సాధించారు. లిజ్ ట్రస్‌కు వచ్చిన ఓట్లు 81,326 పోలుకాగా, రిషి సునాక్‌కు 60,399 ఓట్లు వచ్చాయి. దీంతో 21 వేల ఓట్ల తేడాతో ట్రస్ నెగ్గినట్లయ్యింది. దీనితో బ్రిటన్‌కు మూడవ మహిళా ప్రధాని ఘనత లిజ్‌కు దక్కినట్లయింది. 2లో

అణచివేత-హక్కుల హరింపు

- జమ్మూకశ్మీర్‌లో 2019 నుంచి చట్టాల దుర్వినియోగం
- జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలకు వేధింపులు
- అమ్నెస్టీ నివేదికలో వెల్లడి

శ్రీనగర్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జమ్మూకశ్మీర్ పరిస్థితి అధ్వాన్న మైంది. అధికరణ 370ను రద్దు చేసి రాష్ట్ర హోదాను తొలగించి జమ్మూకశ్మీర్‌ను ముక్కలు చేసి కేంద్ర పాలిత ప్రాంతంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రకటించింది. లోయ ప్రజలపై అధికార జులం, అణచివేతను కొనసాగించింది. 2019 ఆగస్టు నుంచి జర్నలిస్టులు, మానవహక్కుల సమర్థకులు/ కార్యకర్తలపై వేధింపులు మొదలయ్యాయి. వారిపై నిఘా, నిర్బంధం, అరెస్టు, క్రిమినల్ విచారణలు, దర్యాప్తులు వంటివి సాగుతూనే ఉన్నాయి. ఇటు వంటి సందర్భాలు 60కుపైగానే ఉన్నట్లు అంతర్జాతీయ మానవహక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 31 పేజీల నివేదికలో వెల్లడించింది. జమ్మూ కశ్మీర్‌లో తీవ్రమైన అణచివేతకు అద్దంపడుతూ గతవారంలో నివేదికను వెలువరించింది.

పాత్రికేయుల స్వేచ్ఛ పరిరక్షణలో న్యాయ వ్యవస్థ పాత్రపై ఓ జర్నలిస్టు స్పందిస్తూ 'కోర్టు అంటే ఏమిటి? అది చట్టం.. మమ్మల్ని చట్టమే శిక్షిస్తోంది... నిందితులు ఎవ్వరూ ఉగ్రవాదులు కాదు. న్యాయరక్షకులు దానిని అడ్డుగా పెట్టుకొని మమ్మల్ని శిక్షిస్తున్నారు. అన్యాయాన్ని సవాల్ చేయగలంగానీ న్యాయగ్రంథాలే అతిక్రమణకు పాల్పడుతుంటే ఏం చేయాలి? పీఎస్‌ఏ ఒక చట్టం, ఉపా ఒక చట్టం, ఎఫ్ఐఆర్‌లు చట్టబద్ధమైనవే' అని అసహనం వ్యక్తంచేశారు. పత్రికా స్వేచ్ఛ జమ్మూ కశ్మీర్‌లో దారుణంగా ఉంది. జమ్మూకశ్మీర్ పోలీసు, సీఐడీ, ఎస్ఐఏ, భారతీయ ఆర్మీ సైనిక ఇంటెలిజెన్స్ విభాగం, ఇంటెలిజెన్స్ బ్యూరో నుంచి లోయ పాత్రికేయులకు 'వెరిఫికేషన్' ఫోన్లు తరచూ వస్తుంటాయని నలుగురు జర్నలిస్టులు తెలిపినట్లు ఆమ్నెస్టీ పేర్కొంది. ఎటువంటి న్యాయాధారం లేకుండా తమకు ఫోన్లు చేసి పోలీసులు విసిగిస్తారని, మౌఖికంగా సమన్లు జారీ చేస్తారని, రాతపూర్వకంగా ఏమీ ఉండదని, అకారణంగా తమ వార్తా సేకరణనే నేరంగా చూపుతారని, ప్రత్యేక కేసు ఉండదని పాత్రికేయుల వాంగ్మూలాలలో వెల్లడి అయినట్లు నివేదిక తెలిపింది. 2019 ఆగస్టు నుంచి కశ్మీర్‌లో 27 మంది

- మిగతా 2 లో

జార్ఖండ్‌లో ఆపరేషన్ కమలం

విఫలం

విశ్వాస పరీక్షలో నెగ్గిన హేమంత్ సోరెన్

రాంచీ: జార్ఖండ్‌లో ఆపరేషన్ కమలం విఫలమైంది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విశ్వాసపరీక్షలో నెగ్గారు. సోమవారం ప్రత్యేకంగా నిర్వహించిన ఒకరోజు అసెంబ్లీ సమావేశంలో ఈ విశ్వాస పరీక్షను నిర్వహించారు. ఆయన ప్రభుత్వానికి మద్దతుగా 48 ఓట్లు వచ్చాయి. విశ్వాస పరీక్షకు ముందే అసెంబ్లీ నుంచి బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేయడంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క ఓటు కూడా రాలేదు. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి కావాల్సిన మ్యాజిక్ నెంబర్ 41 కాగా జేఎంఎం కూటమికి 48 ఓట్లు అనుకూలంగా వచ్చాయి. విశ్వాస పరీక్షకు ముందు హేమంత్ సోరేన్ మాట్లాడుతూ... ఎన్నికల్లో గెలవ దానికి అల్లర్లకు ఆజ్యం పోసి దేశంలో అంత ర్యుద్ధం లాంటి పరిస్థితిని ఏర్పరచడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తన ప్రభుత్వాన్ని పడగొట్టడానికి అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ... ఎమ్మెల్యేలను ప్రలోభపెడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రజలు బట్టలు, నిత్యావ సర వస్తువులు కొంటారని, బీజేపీ మాత్రం శాసన సభ్యులను కొనుగోలు చేస్తుందన్నారు. ఈ క్రమంలో బీజేపీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. జార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 81 మంది సభ్యులు ఉన్నారు.జేఎమ్ఎమ్‌కు 30,

- మిగతా 2 లో

కమ్యూనిస్టుల ఏకీకరణ జరగాలి

- సోషలిజమే ప్రత్యామ్నాయం
- కాంగ్రెస్ పార్టీ తీరు మారాలి
- సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలో రాజా

మాట్లాడుతున్న రాజా. వేదికపై కూనంనేని సాంబశివరావు, చాడ వెంకటరెడ్డి, పల్లా వెంకటరెడ్డి, రామకృష్ణ తదితరులు

విశాలాంధ్ర-శంషాబాద్: సైద్ధాంతిక ప్రాతిపదికన కమ్యూనిస్టు పార్టీల ఏకీకరణ జరగాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శిగా చంద్ర రాజేశ్వరరావు ఉన్న సమయంలో 1989లో కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణ జరగాలన్నారని గుర్తు చేశారు. తాజాగా కమ్యూనిస్టు పార్టీల ఏకీకరణ కావాలని సీపీఐ ప్రతిపాదిస్తున్నదని, ఈ మేరకు విజయవాడలో జరిగే జాతీయ మహాసభలకు సంబంధించిన ముసాయిదా రాజకీయ తీర్మానంలో పేర్కొన్నట్లు రాజా వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని కామ్రేడ్ గుండా మల్లేశ్ ప్రాంగణం (మల్లికా కన్వెన్షన్ సెంటర్)లో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలో భాగంగా సోమవారం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. డి.రాజా ప్రారంభోపన్యాసం చేస్తూ గతంలో చెప్పిన పునరేకీకరణకు, నేడు ప్రతిపాదిస్తున్న ఏకీకరణకు తేడా ఏమిటంటే, సీపీఎం జనతా ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతోందనీ, సీపీఐ జాతీయ ప్రజాస్వామ్యం గురించి చెబుతోందని, వీటి విషయంలో సైద్ధాంతిక ప్రాతిపదికన కమ్యూనిస్టు పార్టీ ఏకీకరణ జరగాలనేది తమ అభిప్రాయమని చెప్పారు. ఇప్పటికే ఈ అంశాన్ని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో చెప్పామన్నారు. ప్రజలకు సామాజిక న్యాయం, సమానత్వం అందాలంటే కమ్యూనిస్టు, వామపక్ష శక్తుల బలోపేతమే మార్గమని రాజా అన్నారు. దేశంలో నూతన పరిస్థితులు, సవాళ్లు నెలకొన్నాయనీ,వాటిని ఎదుర్కొనేందుకు బలమైన సీపీఐ నిర్మాణం జరగాలని, రాష్ట్ర , జాతీయ రాజకీయాలను కుదిపేసే విధంగా ఎదగాలని సూచించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేస్తోందని, ఈ ప్రభుత్వం మతతత్వ, ఫాసిస్టు, పెట్టుబడిదారుల ఆశ్రిత పక్షపాత ప్రభుత్వమని విమర్శించారు. ప్రభుత్వ రంగాన్ని, లౌకికవాదాన్ని ధ్వంసం చేస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ మతోన్మాద, ఫాసిస్టు సంస్థ అని, అది పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అణచివేస్తోందన్నారు. దేశాన్ని హిందూ మత రాజ్యంగా మార్చాలని చూస్తోందని, అసలు ఆర్ఎస్ఎస్‌కు మొత్తం హిందువుల తరపున ప్రాతినిధ్యం వహించాలని ఎవరూ బాధ్యతలు అప్పగించలేదన్నారు. మోదీ ప్రభుత్వం శరవేగంగా నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తూ, కార్పొరేట్, బడా సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ ప్రభుత్వాన్ని కూలదోయడమే కాదని, దానికి ప్రత్యామ్నాయం చూపించాల్సిన బాధ్యత మనపై ఉన్నదని,అందరికీ విద్య ఆరోగ్యం ఉపాధి, గృహాలు, ఆహార హక్కు వంటి ప్రాథమిక అంశాలను కల్పించడమే ప్రత్యామ్నాయ విధానమని రాజా స్పష్టం చేశారు. కార్మిక, కర్షక వర్గాన్ని కేవలం ఆర్థిక డిమాండ్ల కోసమే కాకుండా రాజకీయ అధికారం కోసం, విప్లవాత్మక సామాజిక మార్పు కోసం కూడగట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీకి వ్యతిరేకంగా జరిగే

- మిగతా 2 లో

సభకు హాజరైన సీపీఐ శ్రేణులు

మహా పాదయాత్రకు అనుమతి నిరాకరణ...

హైకోర్టులో రైతుల పిటిషన్

న్యాయమైన డిమాండ్ల సాధనకే: తిరుపతిరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి-అరసవెల్లి మహా పాదయాత్రకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో అమరావతి పరిరక్షణ సమితి కార్యదర్శి తిరుపతిరావు సోమవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజధాని రైతుల ఉద్యమం 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 12 నుంచి జరుపతలపెట్టిన అమరావతి-అరసవిల్లి పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. దీంతో రైతులు హైకోర్టును ఆశ్రయించారు. అమరావతి స్థానంలో వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులు అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో అరసవిల్లికి పాదయాత్ర నిర్వహించి ఇతర జిల్లాల ప్రజలకు దీనిపై అవగాహన కల్పించేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. గతంలో తుళ్ళూరు నుంచి తిరుపతికి ఇదే తరహాలో రైతులు పాదయాత్ర నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసారి అరసవిల్లి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అయితే దీనికి పోలీసులు అనుమతి నిరాకరించడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ నెల 12న ప్రారంభమయ్యే

- మిగతా 2 లో

బెంగళూరులో కుండపోత

- వరదనీటిలో ఐటీ హబ్
- రూ.225 కోట్ల నష్టం

ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బెంగళూరు నగరంలో మోకాళ్లలోతు నీళ్లు చేరాయి. అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పడవలు, ట్రాక్టర్లు సేవలందించగా, రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంలోని అనేక సరస్సులు, మురికినీటి కాలువలు పొంగిపొర్లడంతో, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. 2 లో

ఉపాధ్యాయుల ఉద్యమాలకు

సీపీఐ అండ

రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయులందరికీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. గత కొంతకాలంగా ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ రోడ్డెక్కి ఉద్యమానికి సిద్ధపడ్డారనీ, విద్య బోధించే గురువులని కూడా చూడకుండా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి గృహ నిర్బంధాలు, అరెస్టులు, వేధింపులకు పాల్పడుతోందని అన్నారు. జగన్ సర్కార్ తీరును నిరసిస్తూ టీచర్స్ డే వేడుకలను ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించడం ప్రభుత్వానికి గొడ్డలిపెట్టు అని పేర్కొన్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు జగన్ తుంగలో తొక్కారన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తానని చేసిన వాగ్దానం 3 ఏళ్లు అయినా అమలుకు నోచుకోలేదన్నారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీ అంశాల్లో సీఎం మాటతప్పి మడమ తిప్పారని విమర్శించారు. ప్రభుత్వ వైఖరితో విసిగి వేసారిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు శాంతియుత నిరసనలకు సిద్ధమైతే పోలీసులచే వారిపై ఉక్కుపాదం మోపడం దుర్మార్గమని చెప్పారు. సీపీఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళన వాయిదా వేసుకున్నప్పటికీ వీరికి, వీరి కుటుంబ సభ్యులకు వేధింపులు, అరెస్టులు, వాహనాలను పోలీస్ స్టేషన్‌లకు తరలించడం వంటి పోలీసుల దుశ్చర్యలు తప్పలేదని అన్నారు. జగన్ నిరంకుశ పాలన, అప్రజాస్వామిక చర్యలు, నిర్బంధకాండలను సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే న్యాయమైన పోరాటానికి ఎల్లప్పుడు అండగా ఉంటుందని రామకృష్ణ తెలిపారు.

అన్న క్యాంటీన్లను అడ్డుకోవడం దుర్మార్గం 2 లో

ఇదీ లోకం!

అద్భుత శిల్పులు ఉపాధ్యాయులు

- వ్యవస్థ మార్పునకు విప్లవం సృష్టించ గల సామర్థ్యం వారిదే
- మెరుగైన జీవితం నేర్పిన గురువుకి రుణపడి ఉంటా
- గురుపూజోత్సవ వేడుకల్లో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మంచి శిల్పి చేతిలో పడితే రాయి కూడా ఒక అద్భుతమైన శిల్పంగా మారుతుందని, అలాంటి అద్భుత శిల్పాలు చెక్కే శిల్పులు మన ఉపాధ్యాయులని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సానపట్టకముందు వజ్రం అయినా

- మిగతా 2 లో

ఐజేయూ అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి

సెక్రటరీ జనరల్‌గా బల్వీందర్ సింగ్ జమ్మూ ఎన్నిక

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఐజేయూ అధ్యక్షునిగా కె.శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ జనరల్‌గా బల్విందర్ సింగ్ జమ్మూ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఐజేయూ ఎన్నికల సెంట్రల్ రిటర్నింగ్ అధికారి ఎం.ఏ.మాజిద్ హైదరాబాద్‌లో సోమవారం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. అధ్యక్ష,సెక్రెటరీ జనరల్ స్థానాలకు ఆగస్ట్ 24వ తేదీన వీరిద్దరూ నామినేషన్లు వేశారు. 14 రాష్ట్రాల యూనియన్లు వారిద్దరినీ బలపరిచారు. నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 25 ఆఖరుతేదీ కాగా ఉపసంహరణకు గడువు సెప్టెంబర్ 5వ తేదీ సాయంత్రం మూడు గంటలకు ముగిసింది. ఇతరులెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో అధ్యక్షునిగా కే.శ్రీనివాస్‌రెడ్డి, సెక్రెటరీ జనరల్‌గా బల్విందర్ సింగ్ జమ్మూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని రిటర్నింగ్ అధికారి మాజిద్ ప్రకటించారు. వర్కింగ్ జర్నలిస్టుల ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో ఎంతో అనుభవజ్ఞులైన వీరిద్దరి సారథ్యంలో ఐజేయూ మరింత పటిష్టం అవుతుందని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారంకోసం గట్టిగా కృషి జరుగుతుందని అన్ని రాష్ట్రాల యూనియన్ల నేతలు భావించి, వారిని ఒప్పించి సారథ్యం చేపట్టాలని ఏకగ్రీవంగా కోరారు. వారికి డి.సోమసుందర్ అభినందనలు తెలిపారు.

మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రానికి సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లు, 2008ని పార్లమెంటు ఉభయ సభల ముందు మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, ఇది ముఖ్యమైన అంశమని, ప్రభుత్వానికి నోటీసు ఇవ్వాలని పిటిషనర్‌ను ఆదేశించింది. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) దాఖలు చేసిన పిల్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేకే మహేశ్వరితో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 1/3వ వంతు రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టడానికి రాజ్యాంగ సవరణను ప్రతిపాదించింది. తొలి మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి 25 ఏళ్లు అయిందని పిటిషన్‌లో తెలిపారు. ఈ బిల్లు 2010లో రాజ్యసభ ఆమోదం పొందిందని,

- మిగతా 2 లో

అన్న క్యాంటీన్లను అడ్డుకోవడం దుర్మార్గం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నిరుపేదలకు ఐదు రూపాయలకే అన్నం పెట్టేందుకు ఏర్పాటు చేస్తున్న అన్న క్యాంటీన్లను వైసీపీ శ్రేణులు, పోలీసులు అడ్డుకోవడం, ధ్వంసం చేయడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో నిరుపేదలు, కార్మికులకు కడుపు నింపాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఏపీలో వైసీపీ అధికారంలోకొచ్చాక కక్షపూరిత వైఖరితో పాలన సాగిస్తూ, అన్న క్యాంటీన్లను తొలగించిందన్నారు. నిరుపేదల ఆకలిని గాలికొదిలేసిందని ఆయన విమర్శించారు. కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం పేదలు, కార్మికుల ఈతిబాధలు వర్ణనాతీతంగా మారాయని పేర్కొన్నారు. కరోనాకు తోడు అధిక ధరలతో సతమతమవుతున్న పేదజనం కనీసం ఒక్క పూట కూడా తిండికి నోచుకోలేని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛందంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైందనీ, కానీ అధికార పార్టీ శ్రేణులు అన్న క్యాంటీన్ల ఏర్పాటును అడ్డుకోవడం, ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. మొన్న కుప్పం, నిన్న తెనాలి, నేడు సత్తెనపల్లిలో అన్న క్యాంటీన్ల ఏర్పాటు అడ్డుకుని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరు పేదలకు రూ.5లకే అన్నం పెడితే వైసీపీకి వచ్చే నష్టం ఏంటి? అని ప్రశ్నించారు. 'అమ్మ పెట్టదు - అడుక్కు తిననివ్వదు' అన్నట్లు జగన్ సర్కార్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ పాల్పడుతున్న దుందుడుకు చర్యలకు పోలీసులు వంతపాడడం విచాకరమన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు అత్యుత్సాహంతో వైసీపీ కార్యకర్తల్లా మహిళలపై జులుం ప్రదర్శించడాన్ని, అన్నాన్ని నేలపాలు చేయడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు. పక్క రాష్ట్రమైన తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ జయలలిత పేరుతోనే అమ్మ క్యాంటీన్లను కొనసాగించడాన్ని చూసైనా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిగ్గు తెచ్చుకోవాలని రామకృష్ణ హితవు పలికారు.

జార్ఖండ్‌లో ఆపరేషన్ కమలం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌కు 18, ఆర్‌జెడికి ఒకరు, ఎన్‌సీపీకి ఒకరు, సీపీఐఎంఎల్‌కు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. ప్రతిపక్ష బిజేపీకి 26, ఏజేఎస్‌యూకు ఇద్దరు, మరో ఇద్దరు స్వతంత్ర్య ఎమ్మెల్యేలు ఉన్నారు. గనుల లీజుకు సంబంధించి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణల నేపథ్యంలో హేమంత్ సోరెన్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి సోరెన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా ఒకవేళ సోరెన్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు పడితే, ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగలేరు. ఇప్పటికే ఎన్నికల సంఘం గవర్నర్‌కు తన అభిప్రాయాన్ని సమర్పించగా, ఆయన దానిపై నిర్ణయాన్ని ప్రకటిస్తారనేది ఉత్కంఠగా మారింది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో మాదిరిగానే అధికార సంకీర్ణ కూటమి ఎమ్మెల్యేలను తనవైపు తిప్పుకోవడం ద్వారా ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని జేఎంఎం తెలిపింది. ఈ క్రమంలోనే జార్ఖండ్ అసెంబ్లీలో సోరెన్ విశ్వాస పరీక్ష ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నారు.

కమ్యూనిస్టుల ఏకీకరణ జరగాలి

(మొదటిపేజీ తరువాయి)

పోరాటంలో అన్ని లౌకిక, ప్రజాతంత్ర పార్టీలు కలిసి పోరాడాలని కోరారు. నయా ఉదారవాద విధానాల అమలుతో ప్రపంచవ్యాప్తంగా మునుపెన్నడూ లేని రీతిలో ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని రాజా ఆందోళన వ్యక్తంచేశారు. ఇది పెట్టుబడిదారి వ్యవస్థ వైఫల్యమని, దీనికి ప్రత్యామ్నాయం సోషలిజం మాత్రమేనని చెప్పారు. ఇప్పటికే లాటిన్ అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలలో, ఆసియా దేశాలలో వామపక్ష, వామపక్ష భావాలు కలిగిన ప్రభుత్వాలను ప్రజలు ఎన్నుకుంటున్నారని తెలిపారు. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభంతో ప్రజలు తిరగబడ్డారని, అయితే దానికి సరైన నాయకత్వం అందించే వారు లేకపోవడం, బలమైన వామపక్షం లేకపోవడంతో విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లలేకపోయారన్నారు. శ్రీలంక లాంటి పరిస్థితులే భారతదేశంలో ఉన్నాయని, ఇక్కడ కూడా సంక్షోభానికి ప్రత్యామ్నాయం సోషలిజమేనని తెలిపారు. అందుకే కమ్యూనిస్టు పార్టీ, వామపక్షాలు బలమైన రాజకీయశక్తిగా ఎదగాలని, ప్రజలను రాజ్యాధికారం దిశగా తీసుకెళ్లాలని రాజా సూచించారు. కాంగ్రెస్ పార్టీ భారతదేశమంతటా విస్తరించిన లౌకిక పార్టీ అని, అయితే అది అంతర్గత సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఆ పార్టీ దాని నుండి బైటపడి, బీజేపీ వ్యతిరేక పోరాటంలో ఆ పార్టీ కూడా ముందుకు రావాలని చెప్పారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకులు తమ విధానాలను కూడా మార్చుకోవాలన్నారు. గతంలో ఆ పార్టీకి చెందిన పీవీనరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడే ఉదారవాద ఆర్థిక సంస్కరణలను తీసుకువచ్చారని, ఇప్పుడు కూడా ఆ విధానాలను, ప్రైవేటీకరణను సమర్థిస్తామంటే కుదరదని రాజా స్పష్టంచేశారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రభుత్వ రంగ సంస్థలు, పంచవర్ష ప్రణాళికలు వచ్చిన విషయాన్నీ మరవకూడదన్నారు.

కేంద్రానికి సుప్రీం నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

అయితే లోక్‌సభ రద్దయిన తర్వాత గడువు ముగిసిందని, రాజ్యసభ ఆమోదించినప్పటికీ లోక్‌సభ ముందు ఉంచలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. సుప్రీం నోటీసులపై భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అని రాజా, నాయకురాలు అక్కినేని వనజ హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీ ముక్త్ భారత్ కావాలి: కేసీఆర్

విశాలాంధ్ర-హైదరాబాద్/నిజామాబాద్: కేంద్రంలో 2024లో బీజేపీయేతర ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. నిజామా బాద్‌లో సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిం చడానికి వెళ్లొచ్చిన ఆయన నగరంలోని గిరిరాజ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ నిర్వీర్యం చేసిందనీ, ఇప్పుడు రైతాంగంపై పడిందని మండిపడ్డారు. పంటలు కొనక, గిట్టుబాటు ధరలు రాక తమ భూములను అమ్ముకునే పరిస్థితి వస్తే వాటిని మోదీ దోస్తులే కొంటరట అంటూ దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో దేశంలో నాన్ బీజేపీ ప్రభుత్వం వస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. 2024లో బీజేపీ ముక్త్ భారత్ నినాదంతో బీజేపీని సాగనంపుదాం... మన ప్రభుత్వమే తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. బీజేపీయేతర ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేశ రైతులందరికీ ఉచిత కరెంటు ఇస్తామన్నారు. వాళ్లు మన బాయిల కాడ మీటర్లు పెట్టుడుకాదు, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న వీళ్లకే మనం మీటరు పెట్టాలె అన్నారు. రైతు సంఘాలు, రైతు బిడ్డలు తమతమ గ్రామాల్లో సమావేశాలు పెట్టి రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొటెలా చైతన్యం తేవాలన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయి, రూపాయి విలువ పతనమైందన్నారు. దళితులు, బలహీన వర్గాలు ఎవరికీ ఏమీ చేయలేదు... దేశంలో ప్రతిపక్ష ప్రభుత్వాలను కూలగొట్టుడే పనిగా బీజేపీ పెట్టుకుందని ఆరోపించారు. ఒక్కనిగా బయలుదేరిన... అందరినీ కూడగట్టి రాష్ట్రం సాధించిన... అలాగే దేశం కోసం నన్ను పోరాడాలంటున్నారు... అందరూ వెంట ఉంటరట మరి మీరందరూ నన్ను ఆశీర్వదిస్తరా చెప్పాలె అని అన్నారు. పచ్చని పంటలు కావాల్నా లేదా మతపిచ్చి మంటలు కావాల్నా అనేది ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. దేశం బాగుంటెనే రాష్ట్రం బాగుంటదని, మతపిచ్చి, విద్వేషాన్ని రగిలిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ భవనం ఉన్నచోట ఇందూరు కళాభారతి ఆడిటోరియం కట్టుకుందామని, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలోని 8 నియోజకవర్గాల అభివృద్ధికి గతంలో ఇచ్చిన ఎమ్మెల్యే ఫండ్స్‌కు అదనంగా రూ.10 కోట్ల నిధులిస్తున్నామని చెప్పారు. దళితబంధు పథకం ఇవ్వడం మన సామాజిక బాధ్యత అని, ప్రజా ప్రతినిధులు దళితబంధును ముందుకు తీసుకుపోవాలని సూచించారు. ఆనాటి నాయకత్వం చిన్న పొరపాటు చేసి, తెలంగాణను ఆంధ్రాలో కలిపితే మళ్లీ తెలంగాణ తెచ్చుకోవడానికి 60 ఏండ్లు పట్టిందన్నారు. దేశంలో 24 గంటలు నాణ్యమైన కరెంటును అన్ని రంగాలకు ఇచ్చే ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని పేర్కొన్నారు. మా తండాలో మా పాలన కావాలని గిరిజనులంటే ఎవరూ లేక చేయలేదని, కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం 3600 తండాలను గ్రామ పంచాయతీలుగా చేసుకున్నామని వివరించారు. మనం అందరికీ ఇచ్చే సంక్షేమ పథకాలన్నీ ఉచితాలట, వాటిని బంద్ చేయమని కేంద్రం వాళ్లు చెప్తరు... ముందు దేశంలోని రైతులందరికీ సాగునీరు కరెంటు ఇస్తే 1 లక్షా 45 వేల కోట్లు మాత్రమే ఖర్చవుతాయని, ఎన్‌పీఏల కింద రూ.12 లక్షల కోట్ల సంపద అమ్ముకున్న మీరు దేశ రైతులందరికీ ఉచిత కరెంటు ఇవ్వలేరా అని కేసీఆర్ నిలదీశారు.

బ్రిటన్ నూతన ప్రధాని లిజ్ ట్రస్

లండన్: బ్రిటన్ కొత్త ప్రధానమంత్రిగా రిషి సునక్‌పై లిజ్ ట్రస్ (47) విజయం సాధించారు. లిజ్ ట్రస్‌కు వచ్చిన ఓట్లు 81,326 పోలుకాగా, రిషి సునాక్‌కు 60,399 ఓట్లు వచ్చాయి. దీంతో 21 వేల ఓట్ల తేడాతో ట్రస్ నెగ్గినట్లయ్యింది. దీనితో బ్రిటన్‌కు మూడవ మహిళాప్రధాని ఘనత లిజ్‌కు దక్కినట్లయింది. విదేశాంగ మంత్రి అయిన ట్రస్ ఆమె ప్రత్యర్థి, మాజీ ఆర్థిక మంత్రి రిషి సునక్ మధ్య నెలకొన్న తీవ్ర ఉత్కంఠ మధ్యాహ్నం 12:30 గంటలకు తెరబడింది. కన్జర్వేటివ్ పార్టీలో ఎక్కువ మంది విదేశాంగ మంత్రి అయిన లిజ్ ట్రస్ వైపే మొగ్గుచూపారు. ఆన్‌లైన్, పోస్టల్ బ్యాలెట్ ద్వారా సుమారు 1.60 లక్షల మంది కన్జర్వేటివ్ పార్టీ సభ్యులు ఓటు వేసి కన్జర్వేటివ్ పార్టీ నేతను ఎన్నుకున్నారు. పోటీలో నిలిచిన మాజీ ఆర్థికమంత్రి రిషి సునాక్‌కు నిరేశ ఎదురైంది. మార్గరెట్ థాచర్, థెరిసా మే తర్వాత బ్రిటన్ అధికారపగ్గాలు చేపట్టిన మహిళగా ట్రస్ విజయం సాధించారు. కన్సర్వేటివ్‌పార్టీ నేతను ఎన్నుకునేందుకు గడచిన ఆరువారాలుగా సాగిన ప్రచారంతోపాటు అంతర్గతంగా పోలింగ్ జరిగి తుది ఫలితాలు వెల్లడయ్యాయి. 2015 ఎన్నికల తర్వాత కన్జర్వేటివ్‌ల నాల్గవ ప్రధానిగా ట్రస్ నమోదవుతారు. బోరిస్ జాన్సన్ అధికారికంగా తన రాజీనామాను సమర్పించడానికి క్వీన్ ఎలిజబెత్‌ను కలవడానికి స్కాట్లాండ్‌కు వెళతారు.

ట్రస్ నేపథ్యం: వామపక్ష భావజాలం ఉన్న కుటుంబంలో 1975లో ఆక్స్‌ఫర్డ్‌లో ట్రస్ జన్మించారు. తండ్రి లెక్కల ప్రొఫెసర్ కాగా తల్లి నర్స్. ఆమె కుటుంబం తర్వాత గ్లాస్గోకు వలస వెళ్లింది. చిన్నతనంలో ట్రస్ అణ్వా యుధ వ్యతిరేక ఉద్యమంలో తల్లితో కలిసి ఉద్యమంలో పాల్గొన్నారు. ఫిలాసఫీ, పాలిటిక్స్, ఎకనామిక్స్‌లో ఆక్స్‌ఫర్డ్‌లో విద్యనభ్యసించారు.

ప్రభుత్వ రాజీనామాకు చెక్ ప్రజల డిమాండ్

విశాలాంధ్ర ప్రపంచం

ప్రాగ్: పెరుగుతున్న జీవన వ్యయంపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చెకోస్లోవేకియా రాజధాని ప్రాగ్‌లో 70,000 మంది నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రాగ్‌లోని వెన్సెస్లా స్క్వేర్ వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వేలాది మంది ప్రదర్శనలో పాల్గొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయంపై ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ బోహేమియా, మొరావియా మాట్లాడుతూ, చెక్ రిపబ్లిక్ స్థాపించబడినప్పటి నుండి ద్రవ్యోల్బణం అత్యధికంగా ఉందని, పేదరికంలో ఉన్న కుటుంబాల సంఖ్య కేవలం ఒక సంవత్సరంలోనే రెట్టింపు అయ్యాయని ఆరోగ్య బడ్జెట్‌లకు భారీ కోతలతో పాటు భారీగా పెరిగిన వ్యయంతో కూడుకున్నదని చెప్పారు. ఈసందర్భంగా కమ్యూనిస్ట్ పార్టీ నాయకురాలు కాటెరినా కొనెక్నా మాట్లాడుతూ "ప్రభుత్వమే కాదు, మొత్తం వ్యవస్థను తొలగించాలి" అనిడిమాండ్ చేశారు. ఈ నెలలో జరగనున్న సెనేట్, మునిసిపల్ ఎన్నికలలో పార్టీకి మద్దతు ఇవ్వాలని ఓటర్లకు పిలుపునిస్తూ, "సిస్టమ్‌లో బగ్‌లు లేవు - వ్యవస్థ స్వయంగా ఒక బగ్" అని ఆమె అన్నారు. ప్రభుత్వం చెక్ పౌరులను "బ్యాంకులు, ఇంధన సంస్థల సేవకులుగా" మార్చిందన్నారు. నాటో నుండి చెక్ ఉపసంహరణకు, ఉక్రెయిన్‌కు ఆయుధ సరఫరాలను నిలిపివేయాలని, గ్యాస్ ధరలను తగ్గించడానికి రష్యాతో వాణిజ్యాన్ని పునఃప్రారంభించాలని, రైట్-వింగ్, లెఫ్ట్ గ్రూపులు డిమాండ్‌చేశారు. నాజీల నుండి రెడ్ ఆర్మీ విముక్తికి సంబంధించిన స్మారక చిహ్నాల వద్ద, రెండవ ప్రపంచ యుద్ధంలో సామూహిక మరణశిక్షలు జరిగిన ప్రదేశాలలో చరిత్రను తిరిగి వ్రాయడానికి, సోవియట్ కాలం నాటి స్మారక చిహ్నాలను కూల్చివేసే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ పార్టీ ర్యాలీలను చేపట్టింది.

కాబూల్ ఆత్మాహుతి దాడిలో 25 మంది మృతి

కాబూల్: అఫ్గాన్ రాజధాని కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయం సమీపంలో సోమవారం ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ దాడుల్లో 25 మంది మృతిచెందారు.. వీరిలో ఇద్దరు రష్యా రాయబార కార్యాలయ సిబ్బంది మరణించినట్లు రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. మరో 8 మంది గాయపడినట్లు సమాచారం. కాబూల్‌లోని రష్యా రాయబార కార్యాలయం సమీపంలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ పేలుడు సంభవించినట్లు ఖామా ప్రెస్ తెలిపింది. కాబూల్‌లోని రష్యన్ రాయబార ప్రవేశ ద్వారం దగ్గర ఆత్మాహుతి బాంబర్ పేలుడు పదార్థాలను పేల్చాడని, గేటు వద్దకు రాగానే సాయుధ గార్డులు కాల్చిచంపారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని సమీపంలో ఆసుపత్రికి తరలించారు. గతంలో కూడా రాయబార కార్యాలయం సమీపంలో పేలుడు కారణంగా 25 మంది మరణించారని రష్యా మీడియా పేర్కొంది. గత నెలలోకూడా కాబూల్‌లో పేలుళ్లు జరిగిన సంగతి తెలిసిందే. హెరాత్ నగరంలోని గుజర్గా మసీదులో గత నెల 18న జరిగిన బాంబు పేలుళ్ల ఘటనలో 21 మంది మరణించారు. సుమారు 200 మంది గాయపడ్డారు.

బెంగళూరులో కుండపోత

బెంగళూరు: ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి బెంగళూరు నగరంలో మోకాళ్లలోతు నీళ్లు చేరాయి. అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో పడవలు, ట్రాక్టర్లు సేవలందించగా, రహదారులపై వరద నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నగరంలోని అనేక సరస్సులు, మురికినీటి కాలువలు పొంగిపొర్లడంతో, లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వరద నీరు ఇళ్లలోకి ప్రవేశించింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సర్జాపూర్ రోడ్‌లోని రెయిన్‌బో డ్రైవ్ లేఅవుట్, సన్నీ బ్రూక్స్ లేఅవుట్ వంటి ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ఉదయం విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లేవారిని తీసుకెళ్లడానికి ట్రాక్టర్లు, పడవలు ఉపయోగించు కున్నారు. ఔటర్ రింగ్ రోడ్డులోని అనేక ప్రాంతాల్లో వర్షాలు, వరదల కారణంగా ఐటీ కంపెనీలు దెబ్బతిన్నాయి. బెంగళూరులో భారీ వర్షాలు కురుస్తున్నాయని, తాను కమిషనర్, ఇతర అధికారులతో మాట్లాడానని, నగరంలోని మహదేవపూర్, బొమ్మనహళ్లి మండలాలకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన బృందాలను నియమించాలని అధికారులను ఆదేశించానని సీఎం బసవరాజ్ బొమ్మై తెలిపారు. బెళ్లందూర్, షార్జాపురా రోడ్డు, అవుట్‌రింగ్ రోడ్, బీఈఎంఎల్ లేఅవుట్ తదితర ప్రాంతాలు నీటమునిగాయి. కొన్ని చోట్ల

బయట పార్క్ చేసిన బైక్‌లు కొట్టుకుపోయిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ సమీపంలోనూ భారీగా వరదనీరు చేరింది.

ఐటీ ఆఫీసులకు రూ.225 కోట్ల నష్టం

నగరంలోకి ఐటీ కారిడార్‌ను కూడా భారీ వర్షం ముంచెత్తింది. అనేక కంపెనీ ఆఫీసుల్లోకి వరదనీరు చేరింది. దీంతో ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయాలని అమెజాన్, విప్రో, ఫ్లిప్‌కార్ట్ వంటి సంస్థలు సూచిస్తున్నాయి. వర్షం కారణంగా తమ కంపెనీలకు రూ.225కోట్ల నష్టం వాటిల్లినట్లు బెంగళూరు ఔటర్ రింగ్‌రోడ్ కంపెనీస్ అసోసియేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మైకి లేఖ రాసింది. దీనిపై చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు. బెంగళూరులో సెప్టెంబరు 9 వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇంధన బిల్లుల పెంపునకు వ్యతిరేకంగా ప్రజాప్రదర్శన

బెర్లిన్: ఇంధన బిల్లుల పెంపుదలకు వ్యతిరేకంగా జర్మనీలోని బెర్లిన్, లైప్‌జిగ్ నగరాల్లో 'సోమవారం నిరసనలు' చెలరేగాయి. జర్మనీలోని లెఫ్ట్ పార్టీ ది లింకే పిలుపు మేరకు నిరసనకారులు సాయంత్రం 7 గంటల నుండి గ్రీన్స్ కార్యాలయాల వెలుపల ర్యాలీ చేపట్టారు. ఇంధన సంస్థల లాభాల పెంపుదలకుగాను గృహాలకు సంవత్సరానికి వందల యూరోలు ఖర్చవుతుందని గ్రీన్స్ పాలనలోని ఆర్థిక, విదేశాంగ మంత్రిత్వ శాఖలు అంచనావేశాయి. వీటి అమలుకు వ్యతిరేకంగా లైప్‌జిగ్‌లో నిరసనకారులు ఆగస్టస్‌ప్లాట్జ్‌లో పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఉక్రెయిన్ యుద్ధంతో ఇంధన కంపెనీలు దోపిడీ చేసి తమ లాభాలను పెంచుకుంటున్నాయని ది లింకే లీప్‌జిగ్ పేర్కొంది. ఈ కారణంగా సమాజంలో మూడింట రెండొంతుల మంది పేదరికానికి గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. పాలక ట్రాఫిక్-లైట్ కూటమి 100 బిలియన్లని ఆయుధాల ప్యాకేజీ కోసం సమీకరించగలిగింది. తత్ఫలితంగా ఆయుధ పరిశ్రమల స్టాక్ ధరలు ఆకాశాన్నంటాయి. జర్మనీ, ఇతర ఐరోపా దేశాల్లో ఇంధన నిల్వల కారణంగా మిలియన్లమంది పేదరికాన్ని ఎదుర్కొంటున్నారు. ఇటలీలో, ఇంధన ఖర్చులు పెరుగుదలకుగాను ప్రజలకు పభుత్వంప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించింది. ప్యాకేజీ కింద తక్కువ-ఆదాయ కుటుంబాలకు విద్యుత్, గ్యాస్ బిల్లులను తగ్గించడంతోపాటు "సిస్టమ్-కాస్ట్" అని పిలవబడే పన్నులను తగ్గించే లక్ష్యంతో ఉంది.

హైకోర్టులో రైతుల పిటిషన్

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి- అరసవెల్లి మహా పాదయాత్రకు దరఖాస్తు చేసినా పోలీసులు అనుమతి ఇవ్వలేదని పిటిషనర్ పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసమే పాదయాత్ర చేయాలని రైతులు నిర్ణయించారని తెలిపారు. హైకోర్టు రిజిస్ట్రీ పిటిషన్‌ను లిస్ట్ చేయగానే హైకోర్టు ధర్మాసనం దీనిపై విచారణ ప్రారంభించనుంది. రైతుల తరపున లాయర్ మురళీధర్‌రావు వాదనలు వినిపించనున్నారు.

ప్రభుత్వానికి మరోసారి చుక్కెదురు

హైకోర్టులో వరుస దెబ్బలు తింటున్న జగన్ సర్కారుకు మరోసారి చుక్కెదురైంది. వైఎస్సార్ క్లినిక్‌లలో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ భర్తీ ప్రకటనపై సోమవారం హైకోర్టులో ప్రభుత్వం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. గతంలో నియామక నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే ఇచ్చింది. స్టే ఎత్తివేసి మంగళవారం జరిగే పరీక్షకు అనుమతించాలని కోరింది. దీనిపై లాయర్ జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ అర్హులైన ఆయుష్ వైద్యులను కాదని నియామకాలు జరపడం వారి హక్కులను కాలరాయడమేనన్నారు. అలాగే బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థుల సిలబస్ ఇచ్చి పరీక్ష పెడితే ఎలా? అని ఆయన ప్రశ్నించారు. రేపటి పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని, దాదాపు రూ.65 లక్షలు వ్యయం చేశామని, అందువల్ల పరీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. అర్హులైన వారిని పక్కనపెట్టి పరీక్ష నిర్వ హిస్తే వారి ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతుందని శ్రవణ్ వాదించారు. వెంటనే స్టే ఎత్తివేసేందుకు కోర్టు నిరాకరించింది. తుది వాదనల కోసం ఈ నెల 9వ తేదీకి విచారణ వాయిదా వేయాలని, ఈలోగా కౌంటర్ వేయాలని ప్రతివాదులను కోర్టు ఆదేశించింది.

అద్భుత శిల్పులు ఉపాధ్యాయులు

(మొదటిపేజీ తరువాయి)

రాయి మాదిరిగానే ఉంటుంది. ఒక మంచి టీచర్ ఒక స్కూల్‌నే కాదు, గ్రామంతో మొదలుపెడితే వ్యవస్థ మార్పునకే ఒక విప్లవాన్ని తీసుకురాగలుగుతాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విజయవాడ ఎ-1 కన్వెన్షన్ సెంటర్‌లో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఎం ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలందజేసి ప్రసంగించారు. ఒక మంచి టీచర్ కేవలం సబ్జెక్ట్‌కే పరిమితం కాకుండా, విద్యార్థుల వ్యక్తిత్వాన్ని మలుస్తాడు. వారి ఆత్మవిశ్వాసాన్ని, విజ్ఞానాన్ని, వివేకాన్ని కూడా పెంచడంలో, వారిలో దాగిన ప్రతిభను బయటకు తీయడంలో కీలకపాత్ర పోషిస్తాడు. క్రమశిక్షణతో జీవించడం నేర్పుతాడు. బతకటం ఎలా అన్న నైపుణ్యం ఉపాధ్యాయుల నుంచే వస్తుంది. పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయుడే. తన దగ్గర చదువుకున్న పిల్లలంతా కూడా తనకంటే ఇంకా గొప్పవాళ్లు కావాలని ఆరాటపడతాడు. అలా ఆరాటపడుతూనే నిజంగా ఆ పిల్లలు అది సాధించినప్పుడు సంతోషపడతాడు. మారుతున్న కాలానికి తగినవిధంగా పిల్లలు పెద్దవాళ్లు అయిన తర్వాత కూడా ఎలా బతకగల్గుతారు అన్నది కూడా ఆలోచిస్తాడు. నాకు చదువు నేర్పిన గురువులకు, అనేక తరాలకు చదువులు నేర్పుతున్న గురువులకు శిరస్సు వంచి వందనాలు చేస్తున్నాను. ఉపాధ్యాయులందరికీ కూడా ఒక శిఖరం లాంటి వ్యక్తి మన సర్వేపల్లి రాధాకృష్ణ. ఆయన రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వారు. మన తెలుగువారు అయిన రాధాకృష్ణ ఈ స్థాయికి ఎదగడమే కాకుండా, ఉపాధ్యాయులందరినీ కూడా ఒక ఎత్తయిన శిఖరంలోకి తీసుకువెళ్లారు. అలాంటి ఆ గొప్పవ్యక్తికి, రాష్ట్రంలో ఇటు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యారంగంలో పనిచేస్తున్న టీచర్లకు, లెక్చరర్లకు ఉపాధ్యాయదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని సీఎం తెలిపారు. ముఖ్యంగా నాకు జన్మనిచ్చినందుకు నా తండ్రికి, ఈ జన్మను సార్థకం చేస్తూ...మెరుగైన జీవితాన్ని పొందటం ఎలాగో నేర్పినందుకు నా గురువుకు ఎల్లవేళలా రుణపడి ఉంటానన్నారు. ఇవి ఎంతో స్ఫూర్తి దాయకమైన మాటలు. ఇవి నేను చెప్పడమే కాదు.. ఒకప్పుడు ఏకంగా ప్రపంచాన్నే పరిపాలించిన అలెగ్జాండర్ ది గ్రేట్ కూడా ఇవే మాటలు చెప్పాడని గుర్తు చేశారు.

విద్యారంగం- మూడేళ్లలో సంస్కరణలు

చదవులకున్న విలువకు, మారుతున్న ప్రపంచంలో మన పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రాధాన్యతా రంగంగా విద్యారంగాన్ని గుర్తించి మన ప్రభుత్వం ఈ మూడు సంవత్సరాల కాలంలో అనేక సంస్కరణలు అమలు చేసినట్లు సీఎం చెప్పారు. తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత చేసిన సమీక్షలలో విద్యాశాఖకు సంబంధించి చేసినన్ని సమీక్షలు మరే శాఖలోనూ చేయలేదన్నారు. దీనికి కారణం రాష్ట్రంలోని పిల్లలు, వారి కుటుంబాలు, వారి తలరాతలను, భవిష్యత్‌ను మార్చగలిగే గొప్పదైన అస్త్రం ఈ విద్యాశాఖ అని, అందుకే విద్యాశాఖమీద అంత ధ్యాస పెట్టామన్నారు. కొన్ని సామాజిక వర్గాలు వేల సంవత్సరాల పాటు చదువులకు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రపంచంతో పోటీ పడలేని చదువును, తమ మీద రుద్దబడిన చదువును, వేరే గత్యంతం లేక చదువుకుంటున్న దుస్థితి ఉందన్నారు. దీన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గడిచిన మూడేళ్లుగా దృష్టి సారించి శ్రీకారం చుట్టిందని, అయితే ఈ మార్పులు ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టాలని తీసుకున్న నిర్ణయాలు కావన్నారు. ఉపాధ్యాయుల చేతిలో శిల్పాలుగా మారే పిల్లల భవిష్యత్తును మరింత మెరుగుపర్చేందుకు, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పేద సామాజిక వర్గాల చరిత్రను పూర్తిగా మార్చే మార్పులు మాత్రమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ బడులలో చదివిన పిల్లలు కూడా కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడి, ఏ పరీక్షలో అయినా సరే నెగ్గేలా మార్పులు చేపట్టామన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం, అక్షరాస్యత పెంపు, నాణ్యమైన విద్యను అందించే దిశగా ఈ మార్పులు తీసుకొస్తున్నామన్నారు. ఇందుకోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి కేవలం విద్య కోసమే దాదాపు రూ.53వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు సీఎం ఆయా పథకాలను వివరించారు. టీచర్లకు, ప్రభుత్వ బడులకు గతంలో ఎన్నడూ లేనంతగా గౌరవం పెంచుతూ, మంచి జరిగేలా అడుగులు వేస్తున్న ప్రభుత్వాన్ని దీవించాలని సీఎం కోరారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులకు సీఎం జగన్ పురస్కారాలు అందించారు.

అణచివేత-హక్కుల హరింపు

(మొదటిపేజీ తరువాయి)

పాత్రికేయులను నిర్బంధించినట్లు పేర్కొంది.

2019 నుంచి మోదీ ప్రభుత్వం అనేక సందర్భాల్లో ప్రజల ప్రాథమిక హక్కులను అణచివేసిందని, అనేక అతిక్రమణలకు పాల్పడిందని వెల్లడించింది. కశ్మీర్‌లో అధికార దుర్వినియోగం, వాక్‌స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ వంటివి హరించబడ్డాయని నివేదిక తెలిపింది. గోప్యతకు విఘాతం కలిగిందని పేర్కొంది. న్యాయం అందుబాటులో లేదని వెల్లడించింది. ఐక్యరాజ్య సమితి మానవహక్కుల మండలితో పాటు అనేక అంతర్జాతీయ హక్కుల సంఘాలు ఈ పూర్వ రాష్ట్రంలో మానవహక్కుల దుస్థితిని వెలుగులోకి తెచ్చే ప్రయత్నాన్ని చేసినట్లు ఆమ్నెస్టీ నివేదిక పేర్కొంది. జర్నలిస్టులు, న్యాయవాదులు, మానవహక్కుల సమర్థకులు / కార్యకర్తలు, మాజీ న్యాయమూర్తులతో పాటు జమ్మూకశ్మీర్ పౌర సమాజ ప్రతినిధులతో జులై, ఆగస్టు నెలల్లో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు (సమాచార సేకరణ) ఆధారంగా తాజా నివేదికను విడుదల చేసినట్లు తెలిపింది.

ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియాపై ఆంక్షల కారణంగా జమ్మూకశ్మీర్‌లోని నిర్బంధ కేంద్రాలు లేదా కోర్టులను చేరుకునే అవకాశం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు లభించలేదని నివేదిక వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో వేర్వేరు వర్గాల నుంచి లభించిన సమాచారం

ఆధారంగానే నివేదికలో కొన్ని అంశాలు ఉన్నట్లు తెలిపింది. 2020 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లు జమ్మూకశ్మీర్‌లో అత్యధికంగా చోటుచేసుకున్నట్లు పేర్కొంది. ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుంచి సాయుధ బలగాలు పౌరులను చట్టవిరుద్ధంగా చంపిన ఘటనలు 20శాతం మేర పెరిగినట్లు తెలిపింది. ఆర్టీఐ వంటివి ఇక్కడ పనిచేయవన్నది. దేశ భద్రత నెపంతో జమ్మూకశ్మీర్ ప్రజల హక్కులను హరించివేసేందుకు కేంద్రప్రభుత్వం చాలా చాకచక్యంగా న్యాయ కార్యాచరణను ఆచరణలో పెట్టింది. సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాల చట్టం, ప్రజా భద్రతా చట్టం వంటి వివాదాస్పద చట్టాల అమలు కొనసాగించిందని నివేదిక వెల్లడించింది. తాజా సంస్కరణల క్రమంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) వంటివి నీరుగారిపోయాయి. 2005లో భారతీయ ప్రభుత్వానికంటే ముందుగానే సమాచార హక్కు చట్టాన్ని జమ్మూకశ్మీర్ అమల్లోకి తెచ్చిందని ఆమ్నెస్టీ నివేదిక తెలిపింది. 2019 వరకు కేంద్ర సమాచార హక్కు చట్టంలోని ప్రగతిశీల నిబంధనల చేరిక బలంగానే సాగింది. కాలక్రమేణ ఈ చట్టం నీరుగారింది. తొలుత రాజకీయ పార్టీలను చట్టం పరిధిలో నుంచి తొలగించారు. సమాచార కమిషనర్ల నిష్పాక్షికతను తక్కువచేసి చూపారు. గతంలో ఆర్టీఐ వ్యవస్థ క్రియాశీలంగా ఉండి 100 అభ్యర్థనలకు కనీసం 70-80కు కచ్చితంగా స్పందన వచ్చేదని ఓ మానవ హక్కుల కార్యకర్త తెలిపినట్లు నివేదిక వెల్లడించింది.

ఈ సంవత్సరం (ఆగస్టు 4 నాటికి) దాఖలైన 585 హెబియస్ కార్పస్ పిటిషన్‌లలో 14 మాత్రమే న్యాయస్థానం ద్వారా పరిష్కరించబడినట్లు ఆమ్నెస్టీ గుర్తించింది. జమ్మూకశ్మీర్ & లధక్ హైకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న 1,346 కేసులను సమీక్షించింది. హెబియస్ కార్పస్ పిటిషన్ల సంఖ్య 32శాతం పెరగడాన్ని గుర్తించింది. 2019లో మొత్తం 761 హెబియస్ కార్పస్ పిటిషన్లు నమోదు అయ్యాయని, 2022లో ఏడు నెలల్లో 585 అభ్యర్థనలు వచ్చినట్లు పేర్కొంది. వీటిలో 569 ప్రజా భద్రతా చట్టం కింద నిర్బంధానికి సంబంధినవి ఉన్నట్లు ఆమ్నెస్టీ నివేదిక వెల్లడించింది. 2019 ఆగస్టు తర్వాత నుంచి ప్రజా భద్రతా చట్టం కింద హెబియస్ కార్పస్ పిటిషన్ పరిష్కారానికి ఏడాదికిపైగా సమయాన్ని హైకోర్టు తీసుకుంటున్నట్లు పేర్కొంది. పీఎస్‌ఏతో పాటు ఉపా (చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం) వినియోగం పెరిగిందని కోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా తెలుస్తోందని ఆమ్నెస్టీ నివేదిక వెల్లడించింది. 568 పీఎస్‌ఏ కేసుల్లో 179 అంటే 31శాతం ఉపా కేసులు ఉన్నట్లు తెలిసిందని, ఉపా వినియోగం 12శాతం పెరిగిందని తెలిపింది.

వినూత్న బోధనా పద్ధతులకు దక్కిన గౌరవం

- 46 మంది టీచర్లకు జాతీయ పురస్కారం
- అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: వినూత్న బోధనా పద్ధతులను అనుసరించినందుకుగాను 46 మంది ఉపాధ్యాయులను జాతీయ టీచర్ల అవార్డు -2022 వరించింది. ముగ్గు రూపేణ గణితం నేర్పడం, క్రమ సంఖ్యగా పీరియాడిక్ టేబుల్; బ్యాగ్ లేకుండా స్కూలుకు రావడం, విద్యార్థులకు శిక్షలు ఇవ్వకపోవడం వంటి పద్ధతులను అవార్డు గ్రహీతలు అనుసరించారు. ఉత్తరప్రదేశ్‌లోని డియోరియా జిల్లాలోని కంపోసిట్ స్కూల్ సహావా టీచరు ఖుర్షీద్ అహ్మద్, తెలంగాణలోని జిల్లా పరిషత్ స్కూలుకు చెందిన కందల రామయ్య, నాగాలాండ్‌లోని జీఎంఎస్ ఆఫీసర్స్ హిల్ స్కూలు టీచర్ మిమీ యోషి; గోవాలోని స్కూలు ప్రిన్సిపల్ మారియా మురేనా మిరాండా; లఢక్‌లోని ప్రభుత్వ ప్రాథమికోన్నత స్కూలు టీచరు మహమ్మద్ జబీర్; మధ్యప్రదేశ్‌లోని సాలేఘుర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఏకైక టీచర్ నీరజ్ సక్సేనా; మణిపూర్‌లోని ఈస్టరన్ ఐడియల్ హైస్కూల్‌కు చెందిన నాంగ్‌మైతమ్ గౌతం సింగ్; ముంబైలోని చతుర్భుజ్ నార్సీ మెమోరియల్ స్కూల్ ప్రిన్సిపల్ కవితా సంఘ్వీ; ఆంధ్రప్రదేశ్‌లోని అన్నారా జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన రవి అరుణ, బీహార్‌లోని లలిత్ నారాయణ లక్ష్మినారాయణ్ ప్రాజెక్ట్ గరల్స్ హైస్కూలు టీచర్ సౌరభ్ సుమన్ వంటివారు వినూత్న పద్ధతులతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ 46 మందికి సోమవారం అవార్డులు ప్రదానం చేశారు. విద్యామంత్రిత్వశాఖ ప్రతిఏటా ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 5న దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. దేశంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తుంది. అవార్డు అందుకున్న టీచర్లలో హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల వారు ముగ్గురు చొప్పున ఉన్నారు. అవార్డు గ్రహీతల్లో యుధ్వీర్, వీరేంద్ర కుమార్, అమిత్ కుమార్ (హిమాచల్ ప్రదేశ్), హర్‌ప్రీత్ సింగ్, అరుణ్ కుమార్ గార్గ్, వందన షాహి (పంజాబ్); శశికాంత సంభాజీరావు కుల్తే, సోమనాథ్ వమన్ వాల్కే, కవితా సంఘ్వీ (మహారాష్ట్ర), కండల రామయ్య, టీఎన్ శ్రీధర్, సునితా రావు (తెలంగాణ); ప్రదీప్ నేగి, కస్తుబ్ చంద్ర జోషి (ఉత్తరాఖండ్); సునీతా, దుర్గారామ్ మువాల్ (రాజస్థాన్), నీరజ్ సక్సేనా, ఓం ప్రకాశ్ పాటిదార్ (మధ్యప్రదేశ్), సౌరభ్ సుమన్, నిశికుమారి (బీహార్), జి.పోన్‌శంకరి, ఉమేశ్ టీపీ (కర్ణాటక), మాలా జిగ్దాల్ దోర్జీ, సిద్ధార్థ యోంజోన్ (సిక్కిం); అంజు దాహియా (హరియాణా), రజినీ శర్మ (దిల్లీ), సీమా రాణి (చండీగఢ్), మారియా మురేనా మిరండా (గోవా), ఉమేశ్ భారత్‌భాయి వాలా (గుజరాత్), మమతా అహేర్ (ఛత్తీస్‌గఢ్), ఈశ్వర్ చంద్ర నాయక్ (ఒడిశా), బుద్ధదేవ్ దత్తా (పశ్చిమ బెంగాల్), మిమీ యోషి (నాగాలాండ్), రంజన్ కుమార్ బిశ్వాస్ (అండమాన్, నికోబార్) ఉన్నారు.

మాతృభాషతోనే నైపుణాభివృద్ధి: ముర్ము

న్యూదిల్లీ: మాతృభాషలో నేర్పినప్పుడే వైజ్ఞానం, సాహిత్యం, సామాజిక శాస్త్రాల్లో నైపుణ్యాభివృద్ధి జరుగుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నొక్కిచెప్పారు. జాతీయ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడారు. ముర్ము సోమవారం మొత్తం 46 మంది టీచర్లకు జాతీయ పురస్కారాలను అందజేశారు. వృత్తి పట్ల నిబద్ధతగా ఉండి,పిల్లల విజ్ఞానాన్ని పెంపొందించేలా వినూత్న బోధనా పద్ధతులను అనుసరించడాన్ని ప్రశంసించారు. తాను స్కూల్లో చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తన టీచర్ల ప్రోత్సాహం వల్ల తమ ఊరి నుంచి కాలేజీకి వెళ్లిన తొలి బాలికగా నిలిచినట్లు తెలిపారు. ప్రపంచంలోని అతిపెద్ద విద్యావ్యవస్థల్లో ఒకటిగా భారతీయ స్కూలు విద్య ఉన్నట్లు ఆమె చెప్పారు. సైన్స్, పరిశోదన, వినూత్నత నేటి విజ్ఞాన ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి ఆధారమని ముర్ము అన్నారు. ఆయా రంగాల్లో భారత స్థాయి పెరగాలంటే స్కూలు విద్యయే పునాది అని చెప్పారు. మాతృభాషలో నేర్పినప్పుడే సైన్స్, సాహిత్యం, సామాజిక శాస్త్రాల్లో నైపుణ్యాభివృద్ధి సమర్థంగా జరగగలదని నమ్ముతున్నానన్నారు. ఏ బిడ్డకైనా తొలిగురువు తల్లేనని, తర్వాత ఆ బాధ్యతను టీచర్లు తీసుకుంటారని ముర్ము చెప్పారు. పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని, ప్రశ్నలు అడగడం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకునేలా ప్రోత్సహించాలని, తద్వారా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని పెంచుకోగలుగుతారని టీచర్లకు ముర్ము సూచించారు. మంచి ఉపాధ్యాయుడు ఎప్పుడూ ఏదో ఒకటి కొత్త విషయం నేర్చుకునేందుకు ఆత్రుతగా ఉంటారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు.

అధికారుల నిర్లక్ష్యం...వృద్ధుడికి శాపం

బతికుండగానే చనిపోయినట్లు నమోదు... ఆగిపోయిన పింఛను

షాజహాన్‌పూర్: బతికుండానే ఒక వృద్ధుడు చనిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేశారు ప్రభుత్వ అధికారులు. దీంతో ఆ వృద్ధుడికి పెన్షన్ ఆగిపోయింది. బ్యాంకు లావాదేవీలు కూడా నిలిచిపోయాయి. ఇవన్నీ కావాలంటే బతికే ఉన్నట్లు సర్టిఫికెట్ తెచ్చుకోవాలని అంటున్నారు అధికారులు. ఉత్తర ప్రదేశ్, షాజహాన్ పూర్ ప్రాంతంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన 70 ఏళ్ల ఓం ప్రకాష్ అనే వృద్ధుడికి ఏడాది కాలంగా వృద్ధాప్య పెన్షన్ రావడం లేదు. కారణం ఏమంటే? ప్రభుత్వ రికార్డుల్లో అతడు చనిపోయినట్లు నమోదు కావడమే. తాను బతికే ఉన్నాను... పెన్షన్ ఇప్పించండి అని ఎంత వేడుకుంటున్నా ఏడాది కాలంగా అధికారులు పట్టించుకోవడం లేదు. బతికే ఉన్నట్లు తెలిపే లైఫ్ సర్టిఫికెట్ తెచ్చుకోమని సూచించారు. దీంతో అతడు అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. పైగా అతడి చెరుకు పంట కూడా నష్టపోయాడు. తిరిగి వ్యవసాయం చేద్దామన్నా, అప్పు తీసుకుందామన్నా సాధ్యం కావడం లేదు. కారణం ప్రభుత్వ రికార్డుల ప్రకారం అతడు చనిపోయి ఉండటమే. 'ప్రభుత్వ రికార్డుల్లో నేను చనిపోయినందున బ్యాంకు నుంచి డబ్బులు కూడా తీసుకోలేక పోయాను. డబ్బులు లేకపోవడంతో నా చెరకు పంటకు నీరందించలేక ఎండిపోయింది... ఇప్పుడు,ఎవరూ నాకు సహాయం చేయడం లేదు' అని ప్రకాష్ శనివారం ఇక్కడ సీనియర్ అధికారుల ముందు వాపోయాడు. ఇక వృద్ధాప్య పెన్షన్ కూడా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పాడు ఓం ప్రకాష్. తన దుస్థితిపై స్పందించి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వ అధికారుల్ని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను మీడియా సంప్రదించగా, ఈ అంశంపై ఓం ప్రకాష్ వద్దకు ప్రభుత్వాధికారుల్ని పంపి విచారణ జరుపుతామని, ఇందులో అధికారుల నిర్లక్ష్యం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విజిలెన్స్ అధికారుల నియామకంలో జాప్యం

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి సర్వోన్నత న్యాయస్థానం సోమవారం నోటీసులు జారీ చేసింది. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఖాళీలను సకాలంలో, పారదర్శకంగా భర్తీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్ మేరకు నోటీసులు ఇచ్చింది. ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ ద్వారా 'కామన్ కాజ్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను విచారణకు చేపట్టిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, అభయ్ ఎస్ ఓకా ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. 2020 జులై 17న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విజిలెన్స్ కమిషనర్ పోస్టును భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానించిందని, ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు జరగలేదని పేర్కొంది. 2021 జూన్‌లో ఏర్పడే ఖాళీలను అంచనా వేస్తూ 2021మే 4న సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ పోస్టు భర్తీకి డీఓపీటీ దరఖాస్తులను ఆహ్వానించిందని, దరఖాస్తు చివరి తేదీ 2020 జూన్ 7. ఆ ప్రకటనకు అనుగుణంగా ఇప్పటి వరకు ఎలాంటి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని పిటీషన్ పేర్కొంది. దీర్ఘకాలంగా ఉన్న ఖాళీలను సకాలంలో భర్తీ చేయడంలో కేంద్రం విఫలమైందని పిటిషనర్ తెలిపారు. కమిషనర్‌లను ఎక్కువ కాలం పాటు నియమించకపోవడం, పౌరుల సమాచార హక్కుకు భంగం కలిగించడమేనని పిటిషనర్ పేర్కొన్నారు. 2020 జులై , 2021మే లో జారీ చేసిన ప్రకటనల ప్రకారం విజిలెన్స్ కమిషనర్, సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌లను నియమించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. దానితో కోర్టు మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

లాలూ ఇంటికి వెళ్లిన నితీశ్

పాట్నా: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సోమవారం ఇక్కడ ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌తో సమావేశమయ్యారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యతను పెంపొందించే ప్రయత్నంలో వివిధ రాజకీయ పక్షాలకు చెందిన నాయకులను కలిసేందుకు నితీశ్ దిల్లీ వెళ్లనున్నారు. అంతకు ముందు లాలూతో భేటీ కావడం ప్రాధన్యతను సంతరించుకుంది. నితీశ్ స్వయంగా సర్క్యులర్ రోడ్‌లోని లాలూ నివాసానికి వెళ్లారు. అక్కడ ప్రస్తుత ఉప ముఖ్యమంత్రిగా ఉన్న లాలు చిన్న కుమారుడు తేజస్వి యాదవ్ ఆయనకు స్వాగతం పలికారు. 'గౌరవనీయ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌జీ ఆర్జేడీ జాతీయ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌ను కలవడానికి మా నివాసానికి వచ్చారు' అని యాదవ్ ట్వీట్ చేశారు. నెల రోజుల కిందటే బీజేపీతో తెగదెంపులు చేసుకున్న నితీశ్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాషాయ పార్టీని ఓడించేందుకు దేశవ్యాప్తంగా వివిధ పార్టీలను ఏకతాటిపైకి తీసుకువస్తానని ప్రతిజ్ఞ చేసిన సంగతి విదితమే. దిల్లీలో ఆయన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తదితరులతో సమావేశం కానున్నారు. చర్చలు సాగించడంలో మాస్టర్‌గా పేరుగాంచిన నితీశ్... బీజేపీ వ్యతిరేక పార్టీల మధ్య విభేదాలను తొలగించడానికి తన రాజకీయ నైపుణ్యాలను ఉపయోగించాలని భావిస్తున్నారు.

జమ్ముకశ్మీర్‌లో ప్రమాదం... ఏడుగురి మృతి

భాదేర్వా/జమ్ము: జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో సోమవారం జరిగిన వేర్వేరు ఘటనలలో రెండు కార్లు కాలువలోకి దూసుకెళ్లడంతో ఏడుగురు వ్యక్తులు మరణించారని పోలీసులు తెలిపారు. దోడా-భదర్వా రహదారిపై ఆరు గంటల వ్యవధిలో జరిగిన రెండు ప్రమాదాల్లో మరో వ్యక్తి గాయపడ్డారని, బాధితుల్లో ఇద్దరు దంపతులు కూడా ఉన్నారని సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దోడా అబ్దుల్ ఖయూమ్ తెలిపారు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో, గల్గంధర్ సమీపంలో, 400 అడుగుల దిగువకు పడిపోయిన తరువాత, కారు నీరు ప్రవాహంలోకి దూసుకెళ్లింది. దీంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆ వ్యక్తి కూడా మరణించినట్టు అధికారులు పేర్కొన్నారు. తరువాత మరణించినట్లు అధికారి తెలిపారు. అంతకుముందు, రెండో ప్రమాదం జరిగిన ప్రాంతానికి రెండు కి.మీ దూరంలో ఉన్న మొగల్ మార్కెట్ వద్ద మరో ప్రైవేట్ కారు సుమారు 300 అడుగుల ఎత్తు నుంచి వాగులోకి పడిపోయింది. ఈ ప్రమాదం తెల్లవారుజామున 12.30 గంటలకు సంభవించిందని, టంగోర్నా-భదర్వా, హిమోట్-భదర్వాకు ఇద్దరు వ్యక్తులను గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. చింతాకు చెందిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది.

నవలఖా బెయిల్‌కు ఎన్ఐఏ కోర్టు తిరస్కృతి

న్యూఢిల్లీ: ఎల్గార్ పరిషత్ కేసులో అరెస్టు అయి 2019 నుంచి జైల్లో ఉన్న కార్యకర్త గౌతం నవలఖా బెయిల్ పిటిషన్‌ను ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు సోమవారం తిరస్కరించింది. నవలఖాకు బెయిల్ ఇచ్చేందుకు ప్రత్యేక న్యాయమూర్తి రాజేశ్ జె.కటారియా నిరాకరించారు. తలోజా జైలులో కాకుండా ఇన్‌హౌస్ కస్టడీకి అనుమతివ్వాలని 70ఏళ్ల నవలఖా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇదే క్రమంలో బాంబే హైకోర్టు ఏప్రిల్ 26న తన ఫిర్యాదును తిరస్కరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను ఆయన సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. తలోజా జైలు కిక్కిరిసిపోయి ఉన్నదని, జైలు వాతావరణం, పరిస్థితులు తన ఆరోగ్యానికి మంచివి కాదని హైకోర్టుకు నవలఖా మొరపెట్టుకున్నారు. నవలఖా కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ ఇటీవల తప్పుకున్నారు. నవలఖా పరిస్థితి దారుణంగా ఉందని, హైసెక్యూరిటీ బరాక్‌కు 2021 అక్టోబరు 12న బదిలీ చేసినప్పటికీ మరింతగా ఆరోగ్యం క్షీణించిందని ఆయన భాగస్వామి (పార్ట్‌నర్) సహబా హుస్సేన్ గతంలో చెప్పారు. హుస్సేన్‌తోగానీ తన న్యాయవాదులకుగానీ క్రమంగా ఫోన్‌లో మాట్లాడేందుకు నవలఖాకు అనుమతిలేదు. కాగా, పూనేలోని షానివార్వాడ వద్ద ఎల్గార్ పరిషత్ సదస్సు జరిగిన మరుసటి రోజు కోరేగావ్-భీమా యుద్ధస్మారకం వద్ద హింస చెలరేగిన క్రమంలో అనేకమంది హక్కుల కార్యకర్తలు, న్యాయవాదులతో పాటు 16 మంది ప్రముఖులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. 84ఏళ్ల కవి వరవరరావుకు, కార్యకర్త, న్యాయవాది సుధా భరద్వాజ్‌కు మాత్రమే ఈ కేసులో బెయిల్ లభించింది. హక్కుల కార్యకర్త, ఫాదర్ స్టాన్‌స్వామి గతేదాది జైల్లో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించిన విషయం విదితమే.

ప్రశ్నిస్తే... వేధింపులే: కాంగ్రెస్

చండీగఢ్: బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం నిరంకుశంగా పాలిస్తోందని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిని వేధిస్తున్నారని కాంగ్రెస్ సోమవారం విమర్శించింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి అఖిలేశ్ ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బ్రిటీష్ కాలంనాటి ఈస్ట్ ఇండియా కంపెనీగా ప్రవర్తిస్తోందని, ప్రజాసంక్షేమం కోసం పనిచేయడం లేదని ఆరోపించారు. 'కేంద్ర ప్రభుత్వం విభజన రాజకీయం చేస్తోంది. నిరంకుశంగా ప్రవర్తిస్తోంది. అధికారం తలకెక్కిన ఈ ప్రభుత్వం ప్రజా విశ్వాసం కోసం పనిచేయడం లేదు. తమ స్వార్థం కోసమే బీజేపీ పనిచేస్తోంది. ఎవరైన ప్రశ్నించినా, ఎదిరించినా వేధింపులే ఎదురవుతున్నాయి. ఈ ప్రభుత్వం ఈస్ట్ ఇండియా కంపెనీలా పనిచేస్తోంది' అని ప్రతాప్ సింగ్ విమర్శించారు. కాంగ్రెస్ 'భారత్ జోడో యాత్ర' గురించి మరిన్ని వివరాలను ప్రతాప్ సింగ్ వివరించారు. ఈ యాత్రను రాహుల్ గాంధీ సెప్టెంబర్ 7న కన్యాకుమారిలో మొదలు పెడతారని, మొత్తంగా 150 రోజుల్లో 3,750 కిలోమీటర్లు యాత్ర చేపట్టి కశ్మీర్‌లో ముగిస్తారని వివరించారు.

కుక్క కరిచి బాలిక మృతి

కొట్టాయం(కేరళ) : కొన్ని వారాల క్రితం వీధి కుక్క కాటుకు గురై వెంటిలేటర్‌పై ఉన్న 12 ఏళ్ల బాలిక సోమవారం మధ్యాహ్నం కొట్టాయం మెడికల్ కాలేజీలో మూడు డోసుల యాంటీ రేబిస్ వాక్సిన్ తీసుకున్నప్పటికీ మరణించింది. ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, 'రేబిస్ కారణంగానే చిన్నారి చనిపోయిందని క్లినికల్ లక్షణాలు సూచిస్తున్నాయి. అయితే పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ నుంచి నిర్ధారణ పరీక్ష ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాం'. అని పేర్కొన్నారు. కేరళలోని పతనంతిట్ట జిల్లా రన్నీకి చెందిన బాలిక ఆగస్టు 14వ తేదీ ఉదయం పాలు కొనేందుకు వెళ్లిన సమయంలో వీధికుక్క పలుమార్లు కరిచింది. అనంతరం ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇప్పటి వరకు మూడు డోస్‌ల యాంటీ రేబిస్ వాక్సిన్ వేయగా, 10వ తేదీ నాలుగో డోసు ఇవ్వాల్సి ఉంది. అయితే, శుక్రవారం సాయంత్రం ఆమె ఆరోగ్యం క్షీణించడంతో పతనంతిట్ట జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొట్టాయం మెడికల్ కాలేజీకి తరలించారు. చిన్నారికి చికిత్స అందించేందుకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కేరళ ఆరోగ్యమంత్రి వీణా జార్జ్ ఆదేశించారు. టీకాలు వేసినప్పటికీ రేబిస్ ఇన్‌ఫెక్షన్ కారణంగా ఇటీవల మరణాలు సంభవించడంపై రాష్ట్రంలో ఆందోళన పెరుగుతోందని, ఆసుపత్రుల్లో ఇస్తున్న యాంటీ రేబిస్ వాక్సిన్ నాణ్యతను పరిశీలించడానికి ప్రభుత్వం నిపుణుల ప్యానెల్‌ను ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి గత వారం అసెంబ్లీలో చెప్పారు.

వెళ్లిపోతామంటే... అడ్డుకోం: అనుమా ఆచార్య

పనాజీ: పార్టీని వీడి వెళ్లిపోతామంటే కాంగ్రెస్ ఎవరినీ అడ్డుకోదనీ, సిద్ధాంతాల ఆధారంగా, ప్రజాస్వామ్యం నమ్మకం అనే పునాదులపై పార్టీ ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ గోవా అధికార ప్రతినిధి అనుమా ఆచార్య సోమవారం తెలిపారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అధికార ప్రతినిధి, రిటైర్డ్ వింగ్ కమాండర్ అయిన అనుమా విలేకరులతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను విశ్వసించే కాంగ్రెస్‌లో పార్టీని వీడే వారిని పార్టీ నిషేధించలేదన్నారు. ఇటీవల కొంతమంది సీనియర్ పార్టీ నాయకులు వెళ్లిపోవడంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, కుటుంబం అయినప్పుడు అందరూ కలిసి ఉండాల్సిన అవసరం లేదన్నారు. భిన్నమైన ఆలోచనలను కలిగి ఉండకుండా కాంగ్రెస్ ఎవరినీ ఆపలేదనీ, పార్టీలో విభిన్న దృక్కోణాలు కలిగిన సభ్యులు ఉంటారని ఆమె అన్నారు.

ఆ నిర్ణయం మంచిదికాదు: ఎన్‌సీపీ

ముంబై: గవర్నర్ కోటా కింద 12 మంది పేర్లను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని గతంలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) చేసిన సిఫార్సును ఉపసంహరించుకోవాలని ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరింత మంది నేతలను అధికార శిబిరంలోకి లాక్కునేందుకేనని ఎన్‌సీపీ సోమవారం ఆరోపించింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని గత ప్రభుత్వం రెండేళ్ల క్రితం ఎమ్మెల్సీలుగా నామినేషన్ కోసం 12 మంది పేర్లను సిఫార్సు చేసింది. అయితే ఫైల్‌ను గవర్నర్ బిఎస్ కోష్యారీ ఆమోదించలేదు. ఎంవీఏ సూచించిన 12 పేర్లలో ప్రముఖంగా కాంగ్రెస్‌ను వీడి శివసేనలో చేరిన నటి ఊర్మిళ మటోండ్కర్ కూడా ఉన్నారు. ఈ సిఫార్సును ఉపసంహరించుకున్నట్లుగా పరిగణించాలని షిండే ప్రభుత్వం గవర్నర్‌కు లేఖ రాసిందని, కొత్త ప్రభుత్వ నిర్ణయాన్ని కోష్యారీ అంగీకరించారని ఆదివారం ఒక అధికారి తెలిపారు. తాజాగా నామినేషన్ల జాబితాను త్వరలో అందజేస్తామని షిండే ప్రభుత్వం గవర్నర్‌కు తెలిపింది. ఎన్సీపీ ప్రధాన అధికార ప్రతినిధి మహేశ్ తపసే సోమవారం మాట్లాడుతూ, 'షిండే ప్రభుత్వ రాజ్యాంగ చెల్లుబాటు ప్రశ్నార్థకంగా ఉంది. దానిపై సుప్రీంకోర్టు తీర్పు కోసం వేచి ఉంది' గత ఎంవీఏ ప్రభుత్వం సిఫార్సు చేసిన పేర్లను రద్దు చేయాలనే నిర్ణయం బీజేపీ-షిండే శిబిరంలోకి మరింత మంది నాయకులను ఆకర్షించడానికేనని తపసే పేర్కొన్నారు. మహారాష్ట్రలో ఓటర్ల మనోభావాలు బీజేపీ-షిండే ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేగంగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

చిదంబరం పిళ్లేకి ప్రధాని నివాళి

న్యూఢిల్లీ: స్వాతంత్ర్య సమరయోధుడు వీఓ చిదంబరం పిళ్లే జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషికి జాతి ఆయనకు రుణపడి ఉంటుందని అన్నారు. ఈ మేరకు ప్రధాని ట్వీట్ చేశారు. చిదంబరం పిళ్లే తమిళనాడులో స్వాతంత్ర్య ఉద్యమానికి చిహ్నమని, దేశం కోసం ఆయన చేసిన త్యాగాలను మరువలేమన్నారు. 'పిళ్లే దేశ ఆర్థిక పురోగతి, స్వావలంబనపై కూడా ఎక్కువ దృష్టి పెట్టారు... అతని ఆదర్శాలు మాకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ప్రధాని పేర్కొన్నారు.

సంజయ్‌రౌత్ కస్టడీ పొడిగింపు

ముంబై: పాత్రాచాల్ కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో శివసేన ఎంపీ సంజయ్ రౌత్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక కోర్టు మరో 14 రోజులు పొడిగించింది. దీంతో సెప్టెంబరు 19 వరకు ఆయన జైల్లోనే ఉండాల్సి వుంది. గుర్గావ్‌లోని పాత్రాచాల్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో ఆర్థికపరమైన అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు రావడంతో దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆగస్టు1న సంజయ్ రౌత్‌ను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. న్యాయస్థానం ఆయనను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. ఆ కస్టడీ సోమవారంతో ముగియడంతో సంజయ్ రౌత్‌ను నేడు ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. బెయిల్ కోసం సంజయ్ రౌత్ ఎలాంటి దరఖాస్తు చేసుకోలేదని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీంతో మరో 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలన్న ఈడీ అభ్యర్థనను అంగీకరించిన న్యాయస్థానం ఆయనకు కస్టడీని పొడిగించింది.

కేసులో ఇరికించమన్న ఒత్తిడితోనే...

సీబీఐ అధికారి ఆత్మహత్యపై మనీష్ సిసోడియా

న్యూఢిల్లీ: తప్పుడు కేసులో తనను ఇరికించమని ఒత్తిడి రావడం వల్లనే సీబీఐ అధికారి ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారని దిల్లీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా తెలిపారు. సీబీఐ అధికారులు ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకునేలా వారిపై ఎందుకు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని ప్రధాని మోదీని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీపై దర్యాప్తు చేస్తున్న సీబీఐ దీనిపై కేసు నమోదు చేసింది. ఈ నేపథ్యంలో గత నెలలో సిసోడియా నివాసంతోపాటు ఆయన బ్యాంకు లాకర్లను తనిఖీ చేసింది. కాగా, ఈ కేసు దర్యాప్తులో భాగమైన సీబీఐ అధికారి జితేంద్ర కుమార్, గత గురువారం తెల్లవారుజామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సిసోడియా సోమవారం మీడియాతో మాట్లాడుతూ, 'నన్ను తప్పుడు కేసులో ఇరికించాలని సీబీఐ అధికారిపై ఒత్తిడి తెచ్చారు. ఆయన ఆ ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు' అని చెప్పారు. సీబీఐ అధికారులు ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకునేలా వారిని ఎందుకింత ఒత్తిడికి గురి చేస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అడగాలనుకుంటున్నానని అన్నారు. బీజేపీ నేత సంబిత్ పాత్ర విడుదల చేసిన స్టింగ్ ఆపరేషన్ వీడియో, ఆయన చేసిన ఆరోపణలను సిసోడియా తోసిపుచ్చారు.

పీఎం పోషణ్ అభియాన్

నిధుల వినియోగంలో కేరళ టాప్: నీతి ఆయోగ్

తిరువనంతపురం: పీఎం పోషణ్ అభియాన్ అమలులో కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం అగ్రస్థానంలో నిలిచింది. ఈ పథకం కింద నిధుల వినియోగంలో పెద్ద రాష్ట్రాల్లో కేరళ అగ్రస్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్ తన నివేదికలో తెలిపింది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 2020 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి కేంద్ర పథకం పోషణ్ అభియాన్ నిధులను కేరళ అత్యధికంగా (58శాతం) వినియోగించుకున్నది. ఒడిశా అత్యల్పంగా (8శాతం) వినియోగించుకున్నది. చిన్న రాష్ట్రాలలో నిధుల వినియోగం నాగాలాండ్‌లో అత్యధికంగా (87శాతం) ఉన్నది. అరుణాచల్‌ప్రదేశ్‌లో అత్యల్పంగా (9 శాతం) ఉన్నది. కేంద్రపాలిత ప్రాంతాల్లో లక్షద్వీప్ అత్యధికంగా (65శాతం), పుదుచ్చేరి అత్యల్పంగా (22శాతం) నిధులను వినియోగించాయి. సంస్థాగత ప్రసవాల సంఖ్య 2020 అక్టోబరు-డిసెంబరు మధ్య తగ్గింది. ఈ కాలంలో దాదాపు 53,48,000 మంది మహిళలు సంస్థాగత సౌకర్యాలలో ప్రసవించారు. కరోనాకు ముందు అంటే 2019లో అక్టోబర్-డిసెంబర్ మధ్య ఇది 54,98,000గా ఉన్నది. 2020 అక్టోబర్-డిసెంబరు కాలంలో సుమారు 30,52,000 మంది లబ్ధిదారులు 48 గంటలు, 14 రోజుల మధ్య ప్రసవానంతర పరీక్షలను పొందారు. అంతకు ముందు ఏడాది ఇదే కాలంలో ఈ సంఖ్య 31,31,000గా ఉన్నది.

కొటక్ మహేంద్రాలో విలీనం వట్టిదే

ఫెడరల్ బ్యాంక్ స్పష్టీకరణ

ముంబై: కొటక్ మహేంద్రా బ్యాంకులో విలీనం కానున్నట్టు వస్తున్న వార్తలను ఫెడరల్ బ్యాంక్ తోసిపుచ్చింది. దీంతో సోమవారం దేశీయ స్టాక్‌మార్కెట్లలో ఫెడరల్ బ్యాంక్ స్టాక్ 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.129.75కి చేరుకుంది ఇది దాదాపు 8 శాతం ఎక్కువ. కొటక్ మహేంద్రా బ్యాంకులో విలీనంపై చర్చలు జరిగినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా వదంతులేనని ఫెడరల్ బ్యాంక్ స్పష్టీకరించింది. ఇందుకు సంబంధించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని పేర్కొంది. గత కొన్ని సెషన్లుగా ఫెడరల్ బ్యాంక్ షేర్ 12 శాతం పెరిగింది. రెండు బ్యాంకుల యాజమాన్యాలు ఇటీవల సమావేశమై విలీనం అంశంపై చర్చించాయని ఒక వార్తా సంస్థలో వార్తలొచ్చాయి. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో వడ్డీ ఆదాయం 8.14 శాతం పెంచుకుంది. గతేడాది రూ.3,355.71 కోట్ల వడ్డీ ఆదాయం సముపార్జించగా, ఈ ఏడాది అది రూ.3,628.86 కోట్లకు చేరింది. ఫెడరల్ బ్యాంకు గత త్రైమాసికంలో రూ.600.66 కోట్ల నికర లాభం గడించింది. గతేడాది నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.1,418 కోట్లు సంపాదిస్తే, ఈ ఏడాది అది రూ.1,605 కోట్లకు పెరిగింది. ప్రత్యక్ష పన్ను వసూళ్లు చేపట్టేందుకు ఫెడరల్ బ్యాంక్, కొటక్ మహేంద్రా బ్యాంకులకు గత జులై నెలాఖరులో అనుమతి లభించింది. ఇందుకోసం ఈ రెండు బ్యాంకులు శాఖల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాయి. నెట్ బ్యాంకింగ్ వేదికల ద్వారా పన్ను చెల్లింపులు స్వీకరిస్తున్నాయి. పన్ను చెల్లింపుదారులు డెబిట్ లేదా క్రెడిట్ కార్డులతోపాటు యూపీఐ, నెట్ బ్యాంకింగ్, క్యాస్, నెఫ్ట్, ఆర్టీజీఎస్ వంటి పద్ధతుల్లో పన్ను చెల్లిస్తున్నారని ఫెడరల్ బ్యాంక్ తెలిపింది. ఎన్నారైలు, దేశీయ ఖాతాదారులు దేశంలోని ఏ శాఖలోనైనా పన్ను చలాన్ దాఖలు చేయొచ్చునని వివరించింది.

అమెరికాలో దొరికిన నటరాజ విగ్రహం

చెన్నై: తమిళనాడులోని తంజావూరు జిల్లా అరుల్మిగు వేదపురీశ్వర ఆలయంలో 62 ఏళ్ల క్రితం చోరీకి గురైన నటరాజ్ విగ్రహం అమెరికాలోని న్యూయార్క్‌లో లభ్యమైనట్లు సీఐడీ సోమవారం వెల్లడించింది. హిందూ మత, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 2 వేల ఏళ్ల నాటి ఆలయంలో కొందరు దొంగలు చొరబడి విగ్రహాన్ని అపహరించారు. సెప్టెంబర్ 1న తిరువీధికుడి గ్రామానికి చెందిన ఎస్ వెంకటాచలం ఫిర్యాదు మేరకు విగ్రహా విష్కరణ విభాగం అధికారులు విచారణ చేపట్టి విగ్రహాన్ని గుర్తించారు. ఆలయం వద్ద ఉన్న నటరాజ విగ్రహం నకిలీదని అసలుది చోరీకి గురైందని పేర్కొన్నారు. దర్యాప్తు బృందం పుదుచ్చేరిలోని ఇండో-ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ నుంచి అసలైన ఫొటోగ్రాఫిక్ చిత్రాలను కోరింది. అసలు చిత్రాన్ని స్వీకరించిన తర్వాత, వింగ్ వివిధ మ్యూజియంల వెబ్‌సైట్‌లు, ఆర్టిఫాక్ట్ కలెక్టర్ల బ్రోచర్‌లు, వేలం హౌస్‌లలో శోధనను ప్రారంభించింది. శోధన తర్వాత, బృందం న్యూయార్క్‌లోని ఆసియా సొసైటీ మ్యూజియంలో అసలు విగ్రహాన్ని కనుగొంది. సంప్రదింపులు జరిపిన ఒక నిపుణుడు, మ్యూజియం వెబ్‌సైట్‌లోని విగ్రహం అసలు విగ్రహమని నిర్ధారించారు. "యునెస్కో ఒప్పందం ప్రకారం విగ్రహాన్ని వెలికితీసేందుకు, విగ్రహం దొంగిలించబడిన ఆలయానికి పునరుద్ధరించడానికి వేగవంతమైన చర్య జరుగుతోంది" అని ఓ అధికారిక ప్రకటన తెలిపింది. ఆలయంలో ఇతర విగ్రహాలు ఏమైనా చోరీకి గురయ్యాయా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు.